సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 22 । మార్చి । 2024



యువత చేతిలో భవిష్యత్తు

యువత చేతిలో దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
36.2 /19.7

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కుక్కల దాడిలో జింక మృతి



సదాశివనగర్ : మండలంలోని అమర్లబండ గ్రామంలో కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలిపారు. బీట్ అధికారిణి పద్మ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అటవీ ప్రాంతం నుంచి కుక్కలు వెంబడించడం వల్ల జింక గ్రామంలోకి వచ్చిందన్నారు.

'పది' పరీక్షకు 22 మంది గైర్హాజరు

కామారెడ్డి టౌన్: జిల్లాలో పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లాలో గురువారం జరిగిన పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11,962 విద్యార్థులకు గాను 11,940 విద్యార్థులు పరీక్ష రాశారు. అలాగే ప్రైవేటులో నలుగురు విద్యార్థులు ఇద్దరు హాజరై, ఇద్దరు గైర్హాజరయ్యారు. సెంటర్లను డీఈవో రాజు, పరీక్షల నిర్వహణ అధికారి నీలం లింగం పర్యవేక్షించారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎసెస్సీ పరీక్ష కేంద్రాలను గురువారం డీఈవో రాజు తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాల, జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలను పరిశీలించారు. ఆయన వెంట మండల విద్యాధికారి రామస్వామి ఉన్నారు.

నవోదయ విద్యాలయంలో విద్యార్థుల ఘర్షణ

■ ఒక విద్యార్థికి గాయాలు



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం రాత్రి తెలంగాణ, ఉత్తరప్రదేశ్(మైగ్రేషన్) విద్యార్థుల మధ్య ఘర్షణ నెలకొంది. ఉత్తరప్రదేశ్ విద్యార్థులు, స్థానిక విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థికి గాయాలయ్యాయి. విద్యార్థుల మధ్య ఘర్షణను నిలువరించేందుకు ప్రయత్నించిన కొందరు ఉపాధ్యాయులకు సైతం స్వల్పంగా గాయాలయ్యాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని ఎల్లారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

'పోచారం' చెక్‌పోస్ట్ వద్ద రూ. 2.50 లక్షల పట్టివేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో భాగంగా జిల్లా సరిహద్దు నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం ఎస్ఎస్‌టీ బృందం అధికారులు రూ. 2.50 లక్షల నగదును పట్టుకున్నారు. మెదక్ జిల్లా కొడిపల్లి మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 2 లక్షలు తన వాహనంలో తీసుకుని మెదక్ వైపు వెళ్తుండగా పోచారం చెక్‌పోస్ట్ వద్ద అధికారులు పట్టుకున్నారు. కుమార్ తరలిస్తున్న నగదుకు ఆధారాలు లేకపోవడంతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఎస్‌టీ అధికారులు సీజ్‌చేసి కేసునమోదు చేశారు. అలాగే వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం బొక్కలగూడెంకు చెందిన యండీ షాన్ అనే వ్యక్తి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 50,100ను పోచారం చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టీ అధికారులు సీజ్ చేశారు. డీఎస్పీ వెంట నాగిరెడ్డిపేట ఎస్సై రాజు, ఏఎస్సై ఉమేశ్, ఎస్ఎస్‌టీ అధికారులు వినాయక్, దక్షిణామూర్తి తదితరులున్నారు.

నేడు అదనపు ప్రథమ శ్రేణి కోర్టు ప్రారంభోత్సవం

కామారెడ్డి క్రైం: జిల్లా కోర్టు భవన సముదాయంలో శుక్రవారం అదనపు ప్రథమ శ్రేణి న్యాయ స్థానాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హైకోర్టు జడ్జి, కామారెడ్డి అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి వర్చువల్‌గా నూతన కోర్టును ప్రారంభిస్తారని వెల్లడించారు.

పెద్దాయనకు పెద్ద షాక్!



- గెలిచినా సంబురం లేకుండా పోయిన వైనం
- ఒక్కొక్కరుగా పార్టీ వీడుతున్న నేతలు
- సహకార బ్యాంక్ చైర్మన్ పదవి కోల్పోయిన వారసుడు

సాక్షి, కామారెడ్డి : ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తిరుగు లేని నేతగా ఎదిగిన మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి గట్టి షాక్‌లే తగులుతున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పిన పోచారంనకు ఇప్పుడు సొంత నియోజకవర్గంలోనే ఎదురుగాలి వీస్తోంది. తన అనుచరులు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. బాన్సువాడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఏనుగు రవీందర్ రెడ్డి నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా పోచారం అనుచరులను పార్టీలోకి లాగుతున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన మండల స్థాయి నేతలు ఇప్పటికే పలువురు హస్తం పార్టీలో చేరిపోయారు. మరికొందరు అదే బాటలో ఉన్నారు. పోచారం అండతో ఎదిగిన కొందరు ప్రజా ప్రతినిధులు కూడా పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. నేతలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నా ఏనుగు రవీందర్ రెడ్డి వదలడం లేదు. పదేళ్ల కాలంలో బాన్సువాడ నియోజకవర్గానికి రూ. పది వేల కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి చేయడం, రాష్ట్రంలోనే అత్యధికంగా 12వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి రికార్డు సృష్టించిన పోచారం.. కాంగ్రెస్ హవాలో కూడా భారీ మెజారిటీతో విజయం సాధించారు. కానీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాకపోవడంతో కొంత నిరాశ చెందారు. ప్రభుత్వం ఏర్పడి ఉంటే ఈసారి మంత్రి అయ్యే అవకాశం ఉండేది.

పార్టీ అధికారం కోల్పోవడంతో ఆధిపత్యానికి గండి

పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ వారసుడిగా, నియోజకవర్గంలో కీలక నేతగా ఎదిగిన ఆయన కుమారుడు భాస్కర్ రెడ్డి డీసీసీబీ చైర్మన్ పదవిలో కొనసాగాడు. అయితే ఆయనపై మెజారిటీ డైరెక్టర్లు తిరుగుబాటు చేసి అవిశ్వాసం పెట్టడంతో పదవి కోల్పోవాల్సి వచ్చింది. దీంతో పెద్దాయనకు దెబ్బ మీద దెబ్బ తగిలినట్టు అయ్యింది. ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించిన పోచారం.. పార్టీ అధికారం కోల్పోవడంతో ఆయన ఆధిపత్యానికి గండి పడినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీనికి తోడు బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత ఏనుగు రవీందర్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తుండడం కూడా ఇబ్బందికరంగా మారింది.

ఎన్‌డీసీసీబీలో నెగ్గిన అవిశ్వాసం

- చైర్మన్ పదవి కోల్పోయిన పోచారం భాస్కర్‌రెడ్డి
- ఇన్‌చార్జి చైర్మన్‌గా కుంట రమేశ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ
- 26న చైర్మన్ ఎన్నిక



భాస్కర్‌రెడ్డి



ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాసానికి అనుకూలంగా 16 మంది డైరెక్టర్లు చేతులెత్తడంతో భాస్కర్‌రెడ్డి చైర్మన్ పదవిని కోల్పోయారు. మొత్తం 17 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. నాగంపేట్ శేఖర్‌రెడ్డి హాజరైనా వ్యతిరేకంగా ఉన్నారు. చైర్మన్ భాస్కర్‌రెడ్డితో పాటు శాంతేశ్వర్, బదావత్ సంగ్రాం సమావేశానికి గైర్హాజరయ్యారు. అనంతరం ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి మెజార్టీ డైరెక్టర్ల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అవిశ్వాస సమావేశానికి డైరెక్టర్లు ఉదయం 10.10 గంటలకు డీసీసీబీ ప్రధాన కార్యాలయానికి ప్రత్యేక బస్సులో చేరుకున్నారు. నిబంధనల ప్రకారం 11 గంటలకు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు అవిశ్వాస తీర్మానంపై చర్చ, ఓటింగ్ నిర్వహించారు.

ఈ నెల 4న అవిశ్వాస నోటీసు

డీసీసీబీ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ ఎన్నికను ఈనెల 26న నిర్వహించనున్నట్లు జిల్లా సహకార సంఘాల రిజిస్ట్రార్ శ్రీనివాస్ రావు ప్రకటించారు. చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై ఈనెల 4న అవిశ్వాస తీర్మానం లేఖను డైరెక్టర్లు అందజేశారని ఆయన తెలిపారు. భాస్కర్ రెడ్డి చైర్మన్ పదవికి రాజీనామా పత్రాన్ని బుధవారం రాత్రి వాట్సాప్ ద్వారా పంపారని, నిబంధనల ప్రకారం లేఖ ఇవ్వకపోవడంతో పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు.

బ్యాంకు అభివృద్ధికి కృషి : ఇన్‌చార్జి చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

ప్రభుత్వం, డైరెక్టర్లు, జిల్లా ఎమ్మెల్యేలు, రైతుల సహకారంతో ఎన్‌డీసీసీబీ అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. చైర్మన్ భాస్కర్‌రెడ్డిపై అసమ్మతితోనే అవిశ్వాసం ప్రవేశపెట్టి నెగ్గామన్నారు.

సీన్ రివర్స్..

2014లో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ, సహకారశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రధాన అనుచరుడైన అప్పటి డీసీసీబీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారీపై ఒత్తిడి తేవడంతో టీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొడుకు భాస్కర్‌రెడ్డిపై ఆ పార్టీ అవిశ్వాసం పెట్టి ప్రతీకారం తీర్చుకుంది. భాస్కర్‌రెడ్డిపై అవిశ్వాసం నెగ్గడంతో 2014 నాటి సీన్ రివర్స్ అయ్యిందని కాంగ్రెస్ నాయకులు చర్చించుకున్నారు.

పీఎఫ్‌ఐ కేసులో నిందితులకు బెయిల్

- షరతులతో మంజూరు చేసిన హైకోర్టు
- నిందితుల్లో ఐదుగురు జిల్లావాసులు

ఖలీల్‌వాడి: పీఎఫ్‌ఐ కేసులో అరెస్టయిన నిందితులకు హైకోర్టు గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇందులో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఐదుగురు ఉన్నారు. నిజామాబాద్ నగరంలోని ఆటోనగర్‌లో యువకులకు శిక్షణ ఇస్తున్న అబ్దుల్‌ఖాదర్‌ను 2022 జూలైలో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రానికి చెందిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్‌ఐ) జిల్లా అధ్యక్షుడు సాదుల్లాతో పాటు మరొకరిని అదుపులోకి తీసుకొని విచారించారు. కేసు తీవ్రతను గుర్తించిన అప్పటి సీపీ నాగరాజు దీని గురించి ఎన్ఐఏకు లేఖ రాశారు. దీంతో ఎన్ఐఏ అధికారులు పీఎఫ్‌ఐ సభ్యులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి కాల్‌డేటా ఆధారంగా జిల్లాలో పలుమార్లు తనిఖీలు చేపట్టారు. అనుమానం ఉన్న వారిని అదుపులోకి తీసుకొని విచారించారు.

పీఎఫ్‌ఐ సభ్యులకు సంబంధించిన ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లలో ఉన్న సమాచారం మేరకు దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు తనిఖీలు చేపట్టారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాతో పాటు దాని అనుబంధ సంస్థలపై నిషేధం విధించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సాదుల్లా(పీఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు), అబ్దుల్‌ఖాదర్ (శిక్షకుడు), సభ్యులు మోబిన్, ఇమ్రాన్, ఫిరోజ్‌పై ఎన్ఐఏ అధికారులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి 2022 జూలైలో చంచల్‌గూడ జైలుకు తరలించారు. నిందితులు బెయిల్ కోసం కింది కోర్టును ఆశ్రయించినా రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మొత్తం తొమ్మిది మందికి బెయిల్ రాగా అందులో జిల్లాకు చెందిన సాదుల్లా, అబ్దుల్‌ఖాదర్, మోబిన్, ఇమ్రాన్, ఫిరోజ్ ఉన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: యువతను నూతన ఓటరుగా నమోదు చేయడంతో పాటు ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్వీప్ కోర్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉన్నదని తెలుసుకునేందుకు ఈ నెల 22న 'వాక్ టు పోలింగ్ బూత్' అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. 26న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 5కే రన్, 28న గోడలపై ఓటు ప్రాముఖ్యతపై చిత్రాలు, స్లోగన్ల పెయింటింగ్‌లు వేయించనున్నట్లు వెల్లడించారు. ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

డూప్లికేట్ ఓట్లను తొలగించాలి

ఓటరు జాబితాల్లో డూప్లికేట్ ఓట్లను తొలగించాలని కలెక్టర్ పాటిల్ సూచించారు. ఈఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా లోంచి తొలగించడానికి వారి కుటుంబ సభ్యులకు ముందుగా నోటీసులు ఇవ్వాలన్నారు. అనంతరం వారి నుంచి వివరణ తీసుకుని పేరును తొలగించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఎఫ్‌వో నిఖిత, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఖర్చును లెక్కించాలి

ఎన్నికల్లో వ్యయ నియంత్రణ ప్రధాన అంశమని, ప్రతి ఖర్చును లెక్కించాల్సి ఉంటుందని కలెక్టర్ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఇందుకోసం ఎన్నికల బృందాలు, సెక్టోరల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రూ.10 లక్షలు పైగా డబ్బు పట్టుపబడిన సందర్భంలో ఆదాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అనుమానాస్పద ఆన్‌లైన్ బ్యాంకు లావాదేవీలపై ప్రతి రోజు నివేదిక అందించాలని సూచించారు. ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ వెలువడిన నుంచి జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. నాలుగు రోజుల్లో రూ. 12.10 లక్షల నగదు, 986 లీటర్ల మద్యం పట్టుకున్నామని వెల్లడించారు.

నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

- ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం
- ఇకపై పంటలకు బీమా సౌకర్యం
- ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



అంతంపల్లిలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

భిక్కనూరు/బాన్సువాడ/దోమకొండ: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఈ విషయంలో రైతులు అధైర్య పడవద్దని వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండలం అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, జంగంపల్లి, బీర్కూర్ మండలం కిష్టాపూర్, దోమకొండ మండలం లింగుపల్లి గ్రామాల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కలిసి అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ఎకరాకు రూ. 10వేల చొప్పున పంట నష్ట పరిహారం అందజేస్తామన్నారు. పరిహారం డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లోనే వేస్తామని తెలిపారు. పంటనష్టపోయిన రైతులకు ఎంత చెల్లించినా తక్కువేనన్నారు. గతంలో పంటలు నష్టపోతే బీఆర్ఎస్ సర్కారు ఒక్క రూపాయి సహాయం అందించలేదన్నారు. వచ్చే వానాకాలం పంటకు రైతులు ఇబ్బందులు పడకుండా పంటకు ఇన్సూరెన్సు ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు.

కౌలు రైతులకూ 'రైతు భరోసా'

రైతు భరోసా పథకాన్ని కౌలు రైతులకు కూడా అందిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా కింద దాదాపు 69 లక్షల మందికి పెట్టుబడి సాయం అందించాల్సి ఉండగా.. మూడు నెలల్లో 60 లక్షలకు పైగా రైతులకు అందించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే మిగిలిన రైతులకు అందిస్తామని మంత్రి తెలిపారు.

రైతులకు పరిహారం ఇవ్వడంలో కేసీఆర్ మొండిచెయ్యి

బీఆర్ఎస్ హయాంలో రైతులు పలుమార్లు అకాల వర్షాలతో పంటలను నష్టపోయినా అప్పటి సీఎం కేసీఆర్ నష్టపరిహారం ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఇటీవల అకాల వర్షాలు కురిసి పంటలకు నష్టం వాటిల్లడంతో పది గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పానన్నారు. ఈ విషయమై సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి ఎకరాకు రూ. 10వేల నష్టపరిహారం ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని తెలిపారు. ఇది రైతులపై సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కారు పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్, టీపీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, భిక్కనూరు ఎంపీపీ గాలిరెడ్డి, పార్టీ నేతలు కుంట లింగారెడ్డి, బల్యాల సుదర్శన్, భీంరెడ్డి, లింబాద్రి, తాటిపల్లి సిద్ధరాములు, ప్రవీణ్‌గౌడ్, అనంతరెడ్డి, అబ్రబోయిన స్వామి, తాటిపల్లి శ్రీకాంత్, రామస్వామి గౌడ్, పందిరి మధుసూధన్‌రెడ్డి, బోయిని శంకర్, కమలాకర్‌రెడ్డి, కాంత్‌రెడ్డి, కాశీరాం, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ఎంపీ స్థానం మాదే..

- లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తాం
- రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోంది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

సాక్షి, కామారెడ్డి: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడతారని, జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కార్ లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో విజయం సాధిస్తారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ధీమా వ్యక్తం చేశారు. గురువారం కామారెడ్డిలోని తన నివాసంలో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ బలంగా ఉంది.. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల ఆదరణ పొందాం.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.. 2019 ఎన్నికల్లో జహీరాబాద్‌లో కేవలం 6 వేల ఓట్లతో కాంగ్రెస్ ఓడింది. కానీ ఈసారి లక్ష మెజారిటీ విజయం సాధిస్తామని' షబ్బీర్ అలీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీగా పనిచేసిన సురేష్ షెట్కార్‌కు అన్ని ప్రాంతాల ప్రజలతో పరిచయాలు ఉన్నాయని.. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ ఏనాడూ నియోజకవర్గంలో తిరగలేదని.. ఆయనకు ప్రజలతో సంబంధాలు లేవని పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే 22వ ప్యాకేజీపై సమీక్ష చేస్తామని.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుని రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టు అంటూ పెద్ద ఎత్తున డబ్బులు దిగమింగారని షబ్బీర్ అలీ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతోందని, అందువల్లే 22వ ప్యాకేజీకి సంబంధించి సమీక్ష చేయలేకపోయామన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రి సమక్షంలో 22వ ప్యాకేజీపై రివ్యూ చేసి పనులు తిరిగి ప్రారంభించేలా చూస్తానన్నారు. కామారెడ్డి ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకురావడం తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు. 'తాను ప్రభుత్వ సలహాదారుగా సీఎం రేవంత్ రెడ్డితో ఉన్న సత్సంబంధాలతో కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రయత్నాలు చేస్తున్నానని.. అయితే ఇక్కడి ఎమ్మెల్యే ప్రొటోకాల్ పేరుతో అడ్డు తగలడం సరికాదని' షబ్బీర్ అలీ హితవు పలికారు. 'ఎమ్మెల్యేగా గెలుపొందిన వ్యక్తి మంత్రులని కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని.. ఆయన చేయకపోగా తాను మంత్రిని తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తుంటే అడ్డు తగలడం సరికాదని' ఆయన పేర్కొన్నారు. తనకు ప్రొటోకాల్ గురించి తెలుసని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున, ప్రభుత్వం నుంచి కావాల్సిన నిధులు తీసుకువస్తానని చెప్పారు. దోమకొండ ఆస్పత్రిని 30 పడకల నుంచి వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమ్మతించారని తెలిపారు. 'పరిహారం గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదని.. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్నపుడు బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పంట నష్టం పరిహారం ఇవ్వలేదని.. అలాంటిది ఇప్పుడు పరిహారం కోసం కేటీఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని' షబ్బీర్ అలీ పేర్కొన్నారు. రైతులని ఆదుకోని కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు.



నిషేధిత ఔషధాల స్వాధీనం

- కామారెడ్డిలో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో దాడులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలో గురువారం హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారులు దాడులు చేశారు. అభ్యంతరకర ప్రకటనలతో నిషేధిత ఔషధాలను పలు దుకాణాల్లో విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశారు. కోణార్క్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్‌లో రుతుస్రావ సమస్యలకు సంబంధించిన రుగ్మతలను తగ్గిస్తుందంటూ కోలినాల్ స్పాస్ ట్యాబ్లెట్లను, స్పాస్మోడిక్ డిస్మెనోరియా అనే నిషేధిత మందులను అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్స్ యాక్ట్ ప్రకారం కొన్ని వ్యాధులు, రుగ్మతలకు సంబంధించి ఔషధాల ప్రకటనలు చేయకూడదు. కాగా చట్టాన్ని అతిక్రమించి తప్పుడు ప్రకటనలతో విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. దాడి చేసిన అధికారు లు నిషేధిత ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు.

క్లుప్తంగా

'కవిత్వం బడుగు జీవుల జీవనానికి అద్దం పట్టాలి'



కామారెడ్డి అర్బన్: కవిత్వం బడుగుజీవుల సమకాలీన జీవనానికి అద్దం పట్టాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్‌శిక్షక్ అన్నారు. ప్రపంచ కవిత్వ దినోత్సవం సందర్భంగా గురువారం తెరవే ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రతి ఏడాది మార్చి 21న నిర్వహిస్తున్న ప్రపంచ కవిత్వ దినోత్సవాన్ని కవులకు ఇచ్చే గౌరవంగా భావించాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాలమిస్టు డాక్టర్ జి.లచ్చయ్య మాట్లాడుతూ.. సమసమాజ బాగుకోసం కవులు, రచయితలు రచనలు చేయాలని కవులకు దిశా నిర్దేశం చేశారు. పలువురు కవులు కవితాగానం చేశారు. తెరవే ప్రతినిధులు అల్లి మోహన్‌రాజ్, మంద పీతంబర్, యెనిశెట్టి గంగాప్రసాద్, కాసర్ల రామచంద్రం, వకుళాభరణం సుధాకర్, కాశ నర్సయ్య, బి.నాగభూషణం, చంద్రకాంత్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ క్రీడాకారులకు అభినందన



కామారెడ్డి అర్బన్: విద్యుత్ ఉద్యోగులు అథ్లెటిక్స్, టగ్ ఆఫ్ వార్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ట్రోఫీ సాధించిన క్రీడాకారులతో పాటు, యాదగిరిగుట్టలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో బహుమతులు సాధించిన కళాకారులను విద్యుత్ ఎస్ఈ రమేశ్‌బాబు వారిని గురువారం సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీఈలు, ఏడీఈలు, జేఏవోలు వెంకటరంగయ్య, నాగరాజు, మల్లేశ్, హన్మంతురెడ్డి, వినోద్, చంద్రశేఖర్, సురేశ్, శ్రీనివాస్, మెహర్‌బాబా, క్రీడల కార్యదర్శి ఎ.గోపి, ప్రతినిధులు ఉత్తమ్‌సింగ్, దినేశ్, అనిల్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కీడ్రాకారిణికి..



కామారెడ్డి అర్బన్: జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి ఎం.నిఖితను ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు గురువారం అభినందించారు. దాద్రానగర్ హవేలీలో నిర్వహించిన సీనియర్ బాలికల విభాగంలో నిఖిత బాగా రాణించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ జి.శ్రీనివాస్‌రావు, వివిధ విభాగాల సమన్వయకర్తలు వి.శంకరయ్య, పి.రామకృష్ణ, అధ్యాపకులు రాజ్‌గంభీర్‌రావు, శారద, రాజేందర్, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



కామారెడ్డి టౌన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు సీహెచ్‌సీలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో ఏవో సయ్యద్ అహ్మద్ మస్నూర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.కార్మికులు గత ఆరు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాల్‌రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు ఎల్. దశరథ్, రఫీక్, లక్ష్మి, ఫాజియా, సునీత, మమత, నర్సమ్మ, అనిత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అలా వెళ్లి.. ఇలా వచ్చేశారు

- పేరుకే డిప్యుటేషన్లు రద్దు
- ఆ ఇద్దరి కనుసన్నల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: వైద్యరోగ్యశాఖలో డిప్యుటేషన్ల రద్దు ప్రక్రియ కాగితాలకే పరిమితమైంది. శాఖ రాష్ట్ర హెల్త్ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డిప్యుటేషన్లు రద్దయ్యాయి. జిల్లాలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఉత్తర్వులు వెలువడిన తరువాత ఎవరి స్థానాల్లోకి వారు వెళ్లినట్టే వెళ్లి మళ్లీ తిరిగివచ్చేయడం చర్చనీయాంశమైంది. శాఖాపరమైన ఉత్తర్వులు లేకున్నప్పటికీ ఓ ఇద్దరు అధికారుల అండ చూసుకుని యథావిధిగా జిల్లా కేంద్రంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. డిప్యుటేషన్ల రద్దు ఉత్తర్వులను ఉద్యోగులు ఖాతరు చేయకపోవడం వెనుక 'మామూళ్ల' కథ దాగి ఉందనే పలువురు పేర్కొంటున్నారు. శాఖలో కీలకంగా వ్యవహరించే ఇద్దరు అధికారుల కనుసన్నల్లో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆరోగ్యశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న 80 మందికి పైగా ఉద్యోగుల డిప్యుటేషన్లు రద్దయ్యాయి. ఫిబ్రవరి 7న ఉత్తర్వులు వెలువడగా, ఉద్యోగులు రెండుమూడు రోజులపాటు సొంత స్థానాల్లో విధులు నిర్వర్తించారు. జిల్లా కేంద్రంలో కొనసాగేందుకు అంతకు ముందే ఓ ఇద్దరు అధికారులకు ముడుపులు ఇచ్చిన ఉద్యోగులు తమ పరిస్థితి ఏమిటని వారిని సంప్రదించినట్లు సమాచారం. ముందే మామూళ్లు అందుకున్న సదరు అధికారులు వెనక్కి వచ్చేయాలని నోటిమాటగా చెప్పగా, పాత స్థానాలకు వెళ్లిన వారు మళ్లీ తిరిగివచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో డిప్యుటేషన్ల రద్దు ఉత్తర్వులు కాగితాలకే పరిమితమయ్యాయి.



జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయం

కలెక్టర్ అనుమతి లేకుండానే..

జిల్లాలో ఎక్కడైనా డిప్యుటేషన్లు అవసరమైతే కలెక్టర్ అనుమతి తీసుకోవాలని రాష్ట్ర హెల్త్ కార్యదర్శి ఆదేశాలు ఇచ్చారు. ఇక్కడే జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు తమ తెలివిని ప్రదర్శించారని పలువురు అంటున్నారు. ముడుపులు అందించిన వారి పేర్లతో డిప్యుటేషన్ల జాబితా రూపొందించి కలెక్టర్ అనుమతి కోసం పెట్టారు. అత్యవసరమైతేనే డిప్యుటేషన్లు తీసుకోవాలని కలెక్టర్ దీన్ని పెండింగ్‌లో పెట్టారు. అయినప్పటికీ అనధికారికంగా డిప్యుటేషన్లు కొనసాగుతున్నాయి. ఈ విషయమై జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుదర్శన్, ఏవో గంగాధర్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా, వారు స్పందించలేదు.



జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఇన్‌చార్జి చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, డైరెక్టర్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యుత్ సంస్థ అభివృద్ధికి పాటుపడదాం

- కార్మికులకు అండగా 1104 యూనియన్
- సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సాయిబాబు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ సంస్థ అభివృద్ధికి పాటుపడదామని, కార్మికులకు తెలంగాణ ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్(1104) అండగా ఉంటుందని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సాయిబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మి కళ్యాణమండపంలో యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, అన్‌లిమిటెడ్ క్రెడిట్‌కార్డులు, ఇన్సురెన్స్ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సుధీర్, ఎన్‌పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి శేషగిరిరావు, అదనపు కార్యదర్శి రంగారావు, జిల్లాలోని ఆయా డివిజన్, కౌన్సిల్ సభ్యులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కమిటీ

జిల్లా అధ్యక్షుడిగా కే రాజేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డీసీ రాజు, ప్రధానకార్యదర్శిగా బి రఘునందన్, అదనపు కార్యదర్శిగా ఎస్ లింగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

అపరాధ రుసుముతో ఫీజు గడువు పొడిగింపు

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలో బీఏ/బీకాం/బీఎస్సీ/బీబీఏ కోర్సులకు రెండో, నాల్గో, ఆరో సెమిస్టర్ రెగ్యులర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువుతేదీని అపరాధ రుసుముతో పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లింపునకు చివరి తేదీ ఏప్రిల్ 15 కాగా, రూ.100 ఫైన్‌తో 16వరకు, రూ.500 ఫైన్‌తో 18వ తేదీ వరకు, రూ.1000 ఫైన్‌తో 19వరకు, రూ.2000ఫైన్‌తో 20వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగిందని తెలిపారు. లేదా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

ప్రకృతిపై మమకారం ఉండాలి



కామారెడ్డి అర్బన్: ప్రకృతిపై మమకారం ఉన్న మనిషే ప్రశాంతంగా జీవిస్తారని కామారెడ్డి ఫారెస్ట్ రేంజ్ అధికారి వి.రమేశ్ అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఫారెస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మొక్క, చెట్టు, అడవులు, వన్యప్రాణులు వాటి సంరక్షణ, పర్యావరణం, ప్రాణవాయువు అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అకడమిక్ సమన్వయకర్త శంకరయ్య, అధ్యాపకులు సుచరణ్, స్వాతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అయ్యో రైతన్న ఎంత కష్టమొచ్చే..



కొల్లూర్‌లో నేలకొరిగిన వరి పైరును పైకి లేపి కడుతున్న కూలీలు

- వడగండ్ల వర్షంతో నేలకొరిగిన వరి
- పైకి లేపి కట్టలు కడుతున్న రైతులు

బాన్సువాడ: రైతుల జీవితమే కష్టాలతో కూడుకున్నది. వేసిన ప్రతి పంట చేతికొచ్చే వరకు నానా కష్టాలు పడుతుంటారు. మూడు రోజుల క్రితం బాన్సువాడలో కురిసిన వడగళ్ల వర్షానికి వందల ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. ధాన్యం గింజలు కుదుము కట్టే క్రమంలో పైరు నేలకొరగడంతో నీళ్లలో ధాన్యం గింజలు మొలకలు వచ్చే అవకాశం ఉంది. మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన ఓ రైతు నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నాడు. వడగళ్ల వర్షానికి మూడెకరాల వరకు వరి పైరు నేలకొరిగింది. చేసేదేమీ లేక కూలీల సాయంతో నేలకొరిని పైరును పైకి లేని ఇలా కట్టలు కట్టి నిలబెడుతున్నాడు. ఇలా కొల్లూర్‌లోనే కాదు మండలంలోని చింతల్‌నాగారం, బాన్సువాడ, బీర్కూర్ మండలం అనానరం, చించోలి కిష్టాపూర్ శివారుల్లో నేలకొరిగిన వరి పైరును రైతన్నలు కట్టలు కడుతూ తమ పంటను రక్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

'ఈ–పాస్' ద్వారానే ఎరువులను విక్రయించాలి

- వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి భాగ్యలక్ష్మి

రామారెడ్డి: రసాయన ఎరువులను రైతులకు అమ్మిన వెంటనే ఈపాస్ యంత్రంలో రైతు ఆధార్ నంబరు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి భాగ్యలక్ష్మి ఆదేశించారు. గురువారం రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి, రెడ్డిపేట్, రామారెడ్డి గ్రామా ల్లోని ఫర్టిలైజర్ షాపులను రామారెడ్డి వ్యవసాయాధికారి హరీశ్‌కుమార్‌తో కలిసి తని ఖీ చేశారు. పలు ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువు ల అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువులు అమ్మినప్పుడు సదరు రైతు ఆధార్ నంబరు ఈ–పాస్ యంత్రంలో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు.



సాగునీటికోసం తిప్పలు

- మైనర్ కాలువల ద్వారా అందని నీరు
- తూములో రాళ్లు ఇరికించిన గ్యాంగ్‌మెన్‌లు

బాల్కొండ: ఎస్సారెస్పీ లక్ష్మి కాలువ మైనర్ కాలువల ద్వారా పంట పొలాలకు నీరందక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ముప్కాల్‌మండలం నాగంపేట్ శివారులో డీ – 4 మైనర్ కాలువ తూములో పెద్ద బండ రాళ్లను ఇరికించడంతో మైనర్‌కాలువ ద్వారా చుక్క నీరు సరఫరా కావడం లేదు. కాలువ నీటిపై ఆధారపడి 50 ఎకరాల్లో సాగవుతున్న వరి ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. గత నాలుగు రోజులుగా నీటి కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. దిగువన ఉన్న చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి సరఫరా కోసం మైనర్ కాలువలను గ్యాంగ్‌మెన్ ద్వారా అధికారులు మూసి వేయిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని కాలువల తూముల్లో పెద్దపెద్ద బండరాళ్లను ఇరికించారు. దీంతో మైనర్ కాలువకు చుక్క నీరందడం లేదు. రైతులే స్వయంగా ట్రాక్టర్ సహాయంతో బండరాళ్లను బయటికి తీసేందుకు ప్రయత్నాలు చేస్తూ విఫలమవుతున్నారు. కాలువ తూమును తవ్వి గండి కొడితేనే నీరు సరఫరా అయ్యే అవకాశం ఉంది. మైనర్ కాలువల తూములకు షట్టర్లను ఇప్పటి వరకు బిగించలేదు. దీంతో రాళ్లు, ఇసుక బస్తాలనే అడ్డుగా పెట్టుకోవాల్సి వస్తోంది. కాలువ ద్వారా నీటి సరఫరా కోసం నాలుగు రోజులుగా తాము ప్రయత్నాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో నాలుగు రోజులు నీరందకపోతే పంట ఎండిపోతుందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.



మైనర్ కాలువలో ఇరికిన రాళ్లను తాడుకట్టి ట్రాక్టర్‌తో లాగుతున్న రైతులు

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

బాన్సువాడ : నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సదరు వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గాంధారి మండలం గండివేట్‌తండాకు చెందిన చందర్ పని నిమిత్తం గురువారం బాన్సువాడకు వచ్చాడు. రోడ్డువెంబడి నడుచుకుంటూ వెళ్తున్న చందర్‌ను నిజామాబాద్–2 డిపోకు చెందిన బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. చందర్ అక్కడికక్కడే మృతి చెందగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్‌ను బైక్ ఢీ కొట్టిన ఘటనలో..

మాచారెడ్డి: సైకిల్‌ను వెనుకనుంచి వచ్చిన బైక్ ఢీకొట్టిన ఘటనలో పాల్వంచ మండలం బండ రామేశ్వర్‌పల్లికి చెందిన కమ్మరి పండరి(48) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పండరి పని నిమిత్తం సైకిల్‌పై మాచారెడ్డికి వెళ్లి ఇంటికి తిరిగివెళ్తుండగా వెనుకనుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. గాయాలపాలైన పండరిని చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి రాత్రి 12గంటలకు పండరి మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దుబాయిలో అనారోగ్యంతో..

రామారెడ్డి: మండల కేంద్రానికి చెందిన ఒంటరి మల్లేశ్‌రెడ్డి అనారోగ్యంతో ఈనె ల 11న దుబాయిలో మృతి చెందాడు. గురువారం మృతదే హం ఇంటికి చేరగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అంత్యక్రియలు పూర్తి చేశారు. ఉపాధినిమిత్తం సుమారు 20 ఏళ్లపాటు మల్లేశ్ రెడ్డి దుబాయిలో ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



మల్లేశ్‌రెడ్డి(ఫైల్)

మద్యం సిట్టింగ్ అడ్డాపై దాడి

- కేసు నమోదు చేసిన ట్రైయినీ ఐపీఎస్
- నిందితుడికి నాలుగురోజుల జైలుశిక్ష

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుపన్‌పల్లి మోటాడి రెడ్డి కళ్యాణ మండపంలో అనుమతులు లేకుండా మద్యం సిట్టింగ్ నడిపిస్తున్నారనే సమాచారం మేరకు ట్రైయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి బుధవారం అర్ధరాత్రి దాడి చేశారు. నిర్వాహకుడు నరేందర్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకొని గురువారం విచారించగా, తన తప్పు ఒప్పుకోవడంతో ట్రైయినీ ఐపీఎస్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నరేందర్‌గౌడ్‌కు సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నాలుగు రోజుల జైలుశిక్ష విధించారు.

మద్యం పట్టివేత



వర్ని/జక్రాన్‌పల్లి/బాన్సువాడ రూరల్/రుద్రూర్: వర్ని మండలంలోని వడ్డేపల్లిలో బెల్ట్‌షాప్‌పై పోలీసులు గురువారం దాడి చేశారు. కిరాణా దుకాణంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రూ.4,500 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణ తెలిపారు. జక్రాన్‌పల్లి మండలం చింతలూర్ గ్రామంలో బెల్ట్‌షాప్‌పై దాడి చేసి రూ.5,800 విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రఘువీర్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదగిరిరెడ్డి అన్నారు. బాన్సువాడ మండలం దేశాయిపేట్, నస్రుల్లాబాద్ మండలం దుర్కి, మిర్జాపూర్, సంగెం గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్‌షాపుల్లో దాడులు నిర్వహించారు. మద్యాన్ని సీజ్ చేసి మద్యం విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కేసులు నమోదు చేశారు. కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత పాతంగల్ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు కిరాణాషాపుపై దాడి చేశారు. గంగాధర్ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ చేసిన 9.7లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై సందీప్ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

బాన్సువాడ: చోరీ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు బాన్సువాడ మెజిస్ట్రేట్ భార్గవి గురువారం తెలిపారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో 2022లో జరిగిన చోరీ ఘటనలో బీర్కూర్‌కు చెందిన గైని కిరణ్, గుంజె గంగాధర్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ దొంగతనం కేసులో..

బాన్సువాడ రూరల్: బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడిన రంజిత్‌సింగ్ అనే వ్యక్తికి బాన్సువాడ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి ఏడాది జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. సెల్‌ఫోన్ దొంగతనం కేసులో రంజిత్‌సింగ్‌ను బాన్సువాడ పోలీసులు 2019లో అరెస్ట్ చేశారు.

కుక్కల దాడిలో జీవాలు మృతి



నిజాంసాగర్(జుక్కల్): పాదిలో వేసిన గొర్రె పిల్లల మందపై వీధికుక్కలు దాడి చేసిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. నిజాంసాగర్‌కు చెందిన కుర్మ సిద్దిరాములు గొర్రెల మందను పోలీస్ స్టేషన్ ముందు ప్రాంతంలోని పొలాల్లో పాదివేశారు. పెద్ద జీవాలు మేతకు వెళ్లగా, పాదిలో ఉన్న గొర్రె, మేక పిల్లలపై కుక్కలుదాడి చేశాయి. పది జీవాలు మృతి చెందాయని, రూ.35వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

పర్సు అప్పగింత

కామారెడ్డి క్రైం: ఆటోలో ప్ర యాణికురాలు మర్చిపోయిన పర్సును పోలీసులకు అప్పగించి డ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని డెయిలీ మార్కెట్‌లో గురువారం ఓ యువతి మహ్మద్‌సిరాజ్‌కు చెందిన ఆటోలో ప్రయాణించింది. ఈ క్రమంలో ఆమె పర్సు మర్చిపోయి వెళ్లిపోయింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన సిరాజ్ పర్సును పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డికి అప్పగించాడు. పర్సులో కొంత నగదు, ఫొటోలు ఉన్నాయని, ప్రయాణికురాలి అడ్రస్ తెలియలేదని ఎస్‌హెచ్‌వో తెలిపారు. పర్సును అప్పగించిన ఆటో డ్రైవర్‌ను ఆయన అభినందించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన సుబద్రబాయి(83) నీటికుంటలో దూకి ఆత్మహత్య చేసుకుందని బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై రవీందర్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నలుగురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేసిన సుబద్రబాయి భర్త లేకపోవడంతో కొంతకాలంగా ఖాజాపూర్‌లో తన తమ్ముడు నాందేవ్ వద్ద ఉంటున్నది. కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగాలేని సుబద్రబాయి గురువారం సాలూర, ఖాజాపూర్ శివారులోని నీటికుంటలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని లక్ష్మాపూర్ అటవీ ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన రాఘవేందర్ అటవీ ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

పేకాటస్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో గురువారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడిచేశామని, పట్టుబడినవారి నుంచి రూ.7,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కటికెగల్లీకి చెందిన అంకరాజు నవీన అనే వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. తన భర్తతో గొడవల కారణంగా నవీన కొంతకాలంగా తల్లిగారింటి వద్ద ఉంటోంది. బుధవారం తల్లి శోభతో గొడవకావడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన నవీన తిరిగిరాలేదు. చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా కూతురి ఆచూకీ లభించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

యువకుడు...

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన వీరబత్తిని శ్రీనివాస్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్ తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. శ్రీనివాస్ తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తి శివారులోని పెద్దవాగు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 45 ఏళ్లు ఉంటుందని తెలిపారు. ఇతర ఆధారాలు ఏవీ లభించలేదని, మృతుడిని గుర్తించేందుకు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై మచ్చేందర్‌రెడ్డి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మాచారెడ్డి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చుక్కాపూర్‌శివారులో గురువారం చోటుచేసుకుంది. అక్కాపూర్ గ్రామానికి చెందిన అరిగె బాల్‌రాజ్ తన భార్య మణెవ్వతో కలిసి ద్విచక్రవాహనంపై అంబారీపేటకు వెళ్లి తిరిగివస్తుండగా చుక్కాపూర్ – బండరామేశ్వర్‌పల్లి రోడ్డుపై కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులకు తీవ్రగాయాలు కాగా చికిత్సనిమిత్తం పోలీసులు 108 అంబులెన్స్‌లో కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

టిఫిన్ సెంటర్‌లో చోరీ

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గరలో సమీపంలో ఉన్న బిందు టిఫిన సెంటర్‌లో దుండగులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. కౌంటర్‌లోని సుమారు రూ.15వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు.

ఎడపల్లిలో బైక్ అపహరణ

ఎడపల్లి: మండల కేంద్రంలో దుండగులు ఓ బైక్‌ను బుధవారం రాత్రి చోరీ చేశారు. మండల కేంద్రానికి చెందిన షేక్ ఇలియాస్ రాత్రి తన ఇంటి ఎదుట బైక్‌ను నిలిపి ఉంచాడు.

ఉదయం బైక్ కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుండగులు బైక్‌ను చోరీకి పాల్పడుతున్నట్లు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.